## క్లుప్తంగా

### ఇంకుడుగుంతల నిర్మాణం వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న రామానుజచారి

రాయికల్: మండలంలోని భూపతిపూర్ స్వచ్ఛ సర్వేక్షణ్ కింద ఎంపిక కాగా, గ్రామంలో చేపడుతున్న ఇంకుడుగుంతల నిర్మాణ పనులను జెడ్పీ సీఈవో రామానుజచారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటింటికీ ఇంకుడుగుంతలు, కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఎంపీడీవో సంతోష్‌కుమార్ ఉన్నారు.

### సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి: వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ మండలంలోని బండలింగపూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యుత్ విషయంలో ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగోని క్రాంతి, చెన్నూరు నిర్మల, తదితరులు ఉన్నారు.

### సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి



ఆయిల్ బాల్స్ వేస్తున సిబ్బంది

ధర్మపురి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. డ్రైడే లో భాగంగా ధర్మపురి పట్టణంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో కమిషనర్ రమేశ్ వివిద వార్డుల్లో కుండీలు, డ్రమ్ములలో నిలువ ఉన్న నీటిని తొలగించారు. ఈసందర్భంగా పట్టణంలోని నీరు నిలిచిన ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ గంగాధర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ గంగాధర్, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

### వేంకటేశ్వర ఆలయ భూమికి హద్దులు



హద్దులు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ భూమిని దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దేవాదాయ శాఖ వరంగల్ ఉప కమిషనర్, కరీంనగర్ సహాయ కమిషనర్ ఆదేశాలతో పట్టణంలోని 1492 సర్వేనంబర్‌లో గల 3.17 ఎకరాల భూమి ఉండగా ఆ ప్రాంత వాసులు అట్టి స్థలం నుంచి రహదారి నిర్మించుకోగా మరి కొందరు ఆక్రమణకు పాల్పడ్డారు. దీంతో దేవాదాయ శాఖ అధికారులు రోడ్డును మూసివేసి ఆలయ స్థలం చుట్టూ జేసీబీ సహాయంతో గుంతలు తవ్వి హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జగిత్యాల దేవాదాయ శాఖ డివిజన్ పరిశీలకులు రవి కిషన్, కార్యానిర్వాహక అధికారి ఎం. విక్రమ్ పాల్గొన్నారు.

### ఎన్‌సీసీ సబ్ యూనిట్ ప్రారంభం

కోరుట్ల: పట్టణంలోని లిటిల్ జీనియస్ హైస్కూల్లో ఎన్‌సీసీ సబ్ యూనిట్‌ను తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కరీంనగర్ కమాండింగ్ ఆఫీసర్ దానియల్ లార్జం శుక్రవారం ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ బండి మహదేవ్ మాట్లాడుతూ పాఠశాలకు ఎన్‌సీసీ సబ్ యూనిట్ రావటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, ఆర్మీ సార్జెంట్, ఆర్మా కార్పోరల్, ప్రిన్సిపాల్స్ రాధాకృష్ణా, వినోద, డైరెక్టర్ రాజు, ఎన్‌సీసీ కేర్ టేకర్ మహేశ్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీళ్లు అందేదెప్పుడో ?

- కలిగోట తండా వాసుల గోడు
- నాలుగేళ్లుగా విన్నవించుకున్నా.. స్పందన లేదంటున్న ప్రజలు



కలిగోట తండాలో నిర్మించిన బ్యాలెన్స్ రిజర్వాయర్ ట్యాంక్

కథలాపూర్: తలాపున గోదావరి ఉన్న తాగేందుకు గుక్కెడు నీరు కరువు అన్న చందంగా మారింది కథలాపూర్ మండలం కలిగోట గిరిజన తండావాసుల పరిస్థితి. మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ మంచినీళ్లు ఇస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పుకుంటున్నా.. కానీ కలిగోట గిరిజన తండాకు ఇప్పటి వరకు మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు ఇవ్వాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునేవారు కరువయ్యారని వేదన వ్యక్తం చేస్తున్నారు.

**కలిగోటలోనే బ్యాలెన్స్ రిజర్వాయర్ ట్యాంక్.. కనెక్షన్లు ఇవ్వని అధికారులు**

కథలాపూర్, మేడిపెల్లి, భీమారం మండలాల్లోని గ్రామాలకు ఇంటింటికీ నీటిని సరఫరా చేసేందుకు కలిగోట తండాలోనే బ్యాలెన్స్ రిజర్వాయర్ ట్యాంక్ నిర్మించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అగ్రహారం నుంచి పైపులైన్ ద్వారా నీళ్లు వచ్చి ఈ ట్యాంకులోకి నీళ్లు చేరేలా పైపులైన్ ఏర్పాటు చేశారు. కలిగోట తండాలో నిర్మించిన రిజర్వాయర్ ట్యాంక్ నుంచి మూడు మండలాలకు తాగునీటిని సరఫరా చేస్తారు. కానీ తండాలోని సుమారు 60 కుటుంబాలకు తాగునీరు ఇచ్చేందుకు ప్రత్యేకంగా పైపులైన్ వేయలేదు. ఫలితంగా తండా వాసులు తాగేందుకు బోరుబావుల మిషన్ నీళ్లు అందడం లేదు. నీటిని సరఫరా చేయాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా స్పందించేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు చొరవ చూపి మిషన్ భగీరథ పథకం నీళ్లు అందేలా చూడాలని కోరుతున్నారు.



కలిగోట తండాలో మిషన్ భగీరథ పైప్‌లైన్

### నాలుగేళ్లుగా పట్టించుకోలే..



కోరుట్ల– వేములవాడ రోడ్డు పక్కనే మా తండా ఉంది. పెద్ద ట్యాంక్ నిర్మించడానికి, పైపులు వేయడానికి 20 గుంటల భూమిని ఇచ్చాం. మాకు తాగునీళ్లు వస్తాయని అనుకున్నాం. నాలుగేళ్లుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో బోరుబావుల నీళ్లు తాగుతున్నాం. అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా నల్లా నీటికి దిక్కులేదు. ఎవరికి చెప్పుకోవాలి మా బాధ.

– ధరావత్ తిరుపతి, కలిగోట తండా

### మండల సభలో ప్రశ్నించిన..



కలిగోట తండాకు మిషన్ భగీరథ పథకం నీళ్లు రావడంలేదని, పైపులైన్ వేయాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నించా. కొన్నిరోజుల్లోనే సమస్య పరిష్కరిస్తామని చెప్పి నాలుగేళ్లు గడిచింది. అధికారుల నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ పథకం నీళ్లు తండాకు రావడం లేదు. ఇప్పటికైనా పరిష్కరించాలి.

– ధరావత్ సరోజ, సర్పంచ్, కలిగోట

### ట్యాంక్ నిర్మిస్తే నీటిని అందిస్తాం



మూడు మండలాలకు నీళ్లు సరఫరా చేసే బ్యాలెన్స్ రిజర్వాయర్ ట్యాంక్ కలిగోట తండాలోనే నిర్మించాం. తండా కోసం ప్రత్యేకంగా ట్యాంక్ నిర్మించలేదు. ట్యాంకు నిర్మిస్తే అందులో మిషన్ భగీరథ నీళ్లు నింపుతాం. ఆ ట్యాంక్ నుంచి నీళ్లు ఇంటింటికీ సరఫరా చేసుకోవచ్చు. రిజర్వాయర్ ట్యాంక్ నుంచి నేరుగా నల్లా కనెక్షన్లు ఇవ్వరాదు.

– అనిల్, ఏఈ,మిషన్ భగీరథ గ్రిడ్

## ప్రతిఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలకు ఈ పథకం ఎంతో వరమని, దీని ద్వారా ఎందరికో ఉచితంగా వైద్యం అందుతుందన్నారు.

**బోనం ఎత్తిన ఎమ్మెల్యే**

జగిత్యాల పట్టణంలోని తులసీనగర్‌లో గంగమ్మతల్లి బోనాల జాతర జరుగగా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బోనం ఎత్తుకుని భక్తి చాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాము, నాయకులు అబ్దుల్ ఖాదీర్, గణేశ్, అడువాల జ్యోతి, పవన్ పాల్గొన్నారు.

**రైతు కుటుంబాలకు భరోసా 'రైతుబీమా'**

జగిత్యాలరూరల్: రైతు కుటుంబాలకు భరోసా ఇచ్చే పథకం రైతుబీమా అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన రైతు గుంటి చిన్నమల్లయ్య ఇటీవల మరణించగా, బాధితకుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశానికి రైతు వెన్నుముఖ అని, తెలంగాణలో ఏ రైతు మరణించినా వారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగారెడ్డి, నాయకులు గుంటి రవి, గంగమలయ్య, గంగరాజం, శశి, మహేశ్, కార్తీక్ పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**కుల సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని వినతి**

జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి గ్రామానికి చెందిన మాదిగ సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని శుక్రవారం కుల సంఘ సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే స్పందించి సాయం చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ చంద రజిత, నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులను వెంటనే ఆస్పత్రిలో చేర్చాలి

జగిత్యాలక్రైం: రోడ్డు ప్రమాదాలకు గురైతే బాధితులను స్థానికులు వెంటనే ఆస్పత్రులకు తరలించాలని జగిత్యాల రూరల్ ఎస్సై నాగపూరి సదాకర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జగిత్యాల రూరల్ మండలం అనంతారంలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న వ్యాపారస్తులకు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు గురైన వ్యక్తిని మరో ప్రమాదంలోకి వెళ్లకుండా వెంటనే ఆస్పత్రిలో చికిత్స అందించేందుకు తరలించాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స చేయించి పోలీసులకు సమాచారం అందించి, వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం సీపీఆర్‌పై వైద్యులు డాక్టర్ శివకుమారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, సతీశ్, ఏఎస్‌ఎం స్వరూప పాల్గొన్నారు.

**మైనర్లు వాహనాలు నడిపితే యజమానులపై చర్యలు**

సారంగాపూర్: మైనర్లు వాహనాలు నడిపితే, వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై తిరుపతి అన్నారు. మండలంలోని రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో శుక్రవారం పోలీసులు ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మైనర్లు వాహణాలు నడపకుండా వారి తల్లితండ్రులు చొరవ చూపాలని తెలిపారు. లక్ష్మీదేవిపల్లి శివారుల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని నాలుగు వాహనాలు పోలీసులు సీజ్ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, ఎస్సై

## 'బీఆర్‌ఎస్ నాయకులకే దళితబంధు'

పెగడపల్లి: బీఆర్‌ఎస్ నాయకులకే దళితబంధు ఇస్తున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు గంగుల కొమురెల్లి ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీకి,రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే పార్టీలకతీతంగా పేదలైన దళితులకు పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.కార్యక్రమంలో చింతకింది అనసూర్య, కొత్తూరి బాబు,పల్లె మోహన్ రెడ్డి,అంజన్న,చింతకింది కిషోర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ఎన్నికల సమయంలో దళితులకిచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. దళితులకు బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయిందని ఆరోపిస్తూ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కడారి గంగాధర్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, పిల్లి శ్రీనివాస్, లవన్‌కుమార్, సంగెపు గంగారాం, గాజు భాస్కర్, ఎంపీటీసీ తిరుపతి తదితరులున్నారు.



మెట్‌పల్లిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మెట్‌పల్లి: దళితుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ పార్క్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం దళితుల సంక్షేమం విషయంలో పూర్తి విఫలమైందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, మాజీ జెడ్పీటీసీ సునీత, నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలక్రైం: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీటీం ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సైబర్ నేరాలపై మానస స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ సైబర్ నేరానికి గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1930కు లేదా 100 డయల్‌చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులు తమ ఇంట్లోని తల్లిదండ్రులు, పక్క వారికి కూడా అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా అమ్మాయిలను వేదిస్తే షీటీం పోలీసు హెల్ప్‌లైన్ నంబరు 87126 70783కి లేదా 100 డయల్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై అలీబేగ్, పాఠశాల డైరెక్టర్ రజిత రావు పాల్గొన్నారు.

## 'ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి'



వినతిపత్రం ఇస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

మల్యాల: మండలంలో ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నాయని, దానిని అరికట్టాలని కోరుతూ యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కటుకం వినయ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తున్నారని, అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, రామాంజనేయులు, జలందర్, కోరెపు వేంకటేశ్, ప్రశాంత్, గౌతమ్,మనీష్, శేషు, రుతిక్ పాల్గొన్నారు.

## గంగనాల ఆయకట్టుకు నీటి విడుదల

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామ శివారులో గోదావరి నదిపై నిర్మించిన గంగనాల ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి గేట్లు ఎత్తి విడుదల చేశారు. ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లోని గ్రామాల్లో సుమారు 4వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కార్యక్రమంలో యామాపూర్ సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న, ఉపసర్పంచ్ అసతి పెద్ద రాజం, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అందుగుల నాగేశ్, ఉపాధ్యక్షుడు కుంబాల పెద్ద రాజం, కోశాధికారి బెల్లల రాజ్‌కుమార్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆషాఢ మాస బోనాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని సిద్దార్థ, రవీంద్ర ప్లేస్కూల్‌లో ఆషాఢ మాసం బోనాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. పోతరాజుల వేషాలు, నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, రజిత, అజిత, మౌనిక, కిషన్, పోచమ్మతల్లి ఆలయ చైర్మన్ గాజుల రాజేందర్ పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని సాయి జీనియస్ పాఠశాలలో ఆషాఢ మాస బోనాల ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కరాస్పాండెంట్ చొకి రమేశ్, ప్రిన్సిపాల్ సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



పచ్చగడ్డి తింటూ నిరసన తెలుపుతున్న కార్మికులు

సారంగాపూర్: పంచాయతీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీజేపీ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. బీర్‌పూర్‌లో తొమ్మిది రోజులుగా పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు శుక్రవారం బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు మ్యాడ జనార్ధన్, ఆడెపు తిరుపతి, అప్పాల జలేందర్, దూట నరేందర్, గుండ వేణు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: గ్రామపంచాయతీ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని కోరుతూ శుక్రవారం వైస్ ఎంపీపీ నొముల లక్ష్మారెడ్డికి పంచాయతీ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మర్రిగడ్డ జగన్, ఉపాధ్యక్షులు అనంతకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శుక్రవారం 9వ రోజుకు చేరింది. ఈ మేరకు ఎంపీపీ, జెడ్పీటీసీలకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, సీహెచ్.రాజయ్య, సురేశ్, పాల్గొన్నారు.

**పచ్చగడ్డి తింటూ నిరసన**

మల్యాల: మండల కేంద్రంలో రిలే దీక్ష చేపట్టిన పారిశుధ్య కార్మికులు శుక్రవారం పచ్చగడ్డి తింటూ నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు సాధించే వరకు దీక్ష కొనసాగిస్తామని అన్నారు. పారిశుధ్య కార్మికులు దీక్షా శిబిరానికి రాకుండా మండల అధికారులు పంచాయతీ కార్యదర్శులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని సీఐటీయూ నాయకులు మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు.

రాయికల్: పంచాయతీ కార్మికుల సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు కేసీఆర్‌కు దండం పెడుతూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల రాజేందర్, మహిపాల్, శ్రీనివాస్, రాజేందర్, రమేశ్, జలేందర్, కిశోర్, గంగారెడ్డి, దేవయ్య, తిరుపతి, స్వరూప పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

కోరుట్ల రూరల్: రక్తదానం ప్రాణ దానంతో సమానమని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. పట్టణ శివారులోని పీవీ నర్సింహారావు వెటర్నరీ పశువైద్య కళాశాలలో జాతీయ సేవా పథకం, రెడ్ క్రాస్ సొసైటీ జగిత్యాల, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కోరుట్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఒక్కరు చేసే రక్తదానం నలుగురి ప్రాణాలకు ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ ఒక్కరు రక్తదానం అలవాటు చేసుకోవాలన్నారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ మాధవరావు, మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య,ఎంపీపీ తోట నారాయణ,జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రవీణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు, ప్రొఫెసర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ**

కథలాపూర్: భీమారం మండలకేంద్రంలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పచ్చదనం– పరిశుభ్రత అందరి బాధ్యత అని నినాదాలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహంత్, ఎంపీటీసీ పల్లి అర్జున్, సర్పంచ్ అరుణ, కార్యదర్శి లక్ష్మి, ఏఎన్ఎం సుశీల, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

**రహదారుల నిర్మాణం ప్రభుత్వానికి పట్టదా?**

మల్లాపూర్: రహదారుల నిర్మాణం, మరమ్మతు, అభివృద్ధి పనులపై ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్ అన్నారు. బీజేపీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ శ్రావణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లాపూర్‌లోని ఓడ్డెర కాలనీ మీదుగా బైపాస్ రోడ్డుని బీటీ రోడ్డుగా మార్చాలని ఏళ్లుగా విన్నవించిన పాలకులు పట్టుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, గొల్లెన వెంకటేష్, శివరాత్రి అంజమ్మ, గడ్డం నవీన్‌రెడ్డి, పందిరి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

**సీఎమ్మార్ఎఫ్ చెక్కులు పంపిణీ**

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లి గ్రామానికి చెందిన రామానుజంకు రూ. 48 వేలు, రాజంకు రూ. 30 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, శుక్రవారం వారికి ప్రజాప్రతినిధులు అందజేశారు. సీఎమ్మార్ఎఫ్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

**అంధ కళాకారుడిని ప్రభుత్వం ఆదుకోవాలి**

కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రానికి చెందిన అంధ కళాకారుడు రవికి ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి కోరారు. శుక్రవారం మేడిపెల్లిలో రవిని ఆయన పరామర్శించారు.రవి పాటలు పాడుతూ భిక్షాటన చేస్తున్నారని, మానవత దృక్పతంతో ఇల్లు త్వరగా నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సూరజ్, శ్రీధర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పొనుగంటి రెడ్డి**

జగిత్యాలటౌన్: బీఎస్పీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జిగా పొనుగంటి రెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి శుక్రవారం తెలిపారు. జగిత్యాల ధరూర్ క్యాంపులో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా నియామకమైన నియోజకవర్గ ఇన్‌చార్జి పొనుగంటి రెడ్డి, పట్టణ అద్యక్షుడు బొల్లారం సతీశ్‌కు లింబాద్రి నియామక పత్రాలు అందజేశారు.

**పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం**

కోరుట్ల: పట్టణంలోని అంబేడ్కర్ నగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సూర్య పిల్లల హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ నరేందర్ పిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అడ్డగట్ల గంగాధర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**భవన నిర్మాణం కూల్చివేత**

కోరుట్ల: పట్టణంలోని హాజీపుర ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా సెట్‌బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న భవనం స్లాబ్ నిర్మాణ సెంట్రింగ్ పనులను మున్సిపల్ సిబ్బంది శుక్రవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ మాట్లాడుతూ బిల్డింగ్ మున్సిపల్ అనుమతుల ప్రకారం కాకుంగా విరుద్ధంగా నిర్మాణాలు చేపడతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీవోఏ ప్రవీణ్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**కార్యదర్శిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు**

మెట్‌పల్లి: ఇబ్రహీంపట్నం గ్రామ పంచాయతీ కార్యదర్శి నారాయణపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. కార్యదర్శి నారాయణ గురువారం విధులు ముగించుకుని వస్తుండగా, గంట రాజేశ్వర్‌రావు అనే వ్యక్తి దాడి చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు రాజేశ్వర్ రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**వంట మనుషులకు దరఖాస్తుల ఆహ్వానం**

రాయికల్: మండలం ఇటిక్యాల మోడల్‌స్కూల్ హాస్టల్‌లో ఒక హెడ్‌కుక్, రెండు ఇద్దరు అసిస్టెంట్ హెడ్‌కుక్‌ల పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు 7వ తరగతిలో ఉత్తీర్ణులై ఆధార్‌కార్డు జిరాక్స్‌లో మహిళలు మాత్రమే సంప్రదించాలని కోరారు.

**విద్యుత్ సరఫరా నిలిపివేత**

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని టౌన్–3 సెక్షన్ పరిధిలోని భవానినగర్, ఎమ్మెల్యే క్వార్టర్స్, కలెక్టర్ రెసిడెన్సీ, కరీంనగర్‌రోడ్, రామాలయం ప్రాంతం, ధరూర్‌క్యాంప్, చర్చ్ ఏరియా, అయ్యప్ప కాలనీ, బుడిగజంగాల కాలనీ, పద్మనాయక బ్యాక్‌సైడ్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ రహీం తెలిపారు.

పట్టణ శివారులోని టీఆర్‌నగర్, చల్‌గల్,అంతర్గాం సబ్‌స్టేషన్ల పరిధిలోని టీఆర్‌నగర్, ధరూర్, నర్సింగాపూర్, వంజరిపల్లి, చల్‌గల్, మోరపల్లి, అంతర్గాం, ఒడ్డెరకాలనీ, అంబారిపేట, తాటిపల్లి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ తెలిపారు.